# దొంగలు

జైరాజ్ రచన

కృష్ణారావు తన రూం మేట్‌గా కలిసిన రోజే - వీణ్ణిదివర కెక్కడో చూసినట్టు బాగా గుర్తే- అనుకున్నాడు వినాయకరావు.

అమాటే అడిగాడు తొలి రోజునే.

"ఏమో, నిన్నెప్పుడూ చూసిన గుర్తులేదే?" అన్నాడు కృష్ణారావు.

"లేదు. నీది నాకు బాగా పరిచయమైన ముఖం" అన్నాడు వినాయకరావు.

"అయినప్పుడు నీదీ నాకు పరిచయమైన ముఖంలా కనబడాలిగా? అయినా మనిషిని పోలిన మనిషుంటాడంటారులే. ఎవడో నన్ను పోలినవాడు నీ పరిచయస్థుల్లోనో లేక నీకు పదేపదే తటస్థించిన వాళ్ళలోనో వుండి వుంటాడు" అన్నాడు కృష్ణారావు.

"లేదు. నిన్నెక్కడో గాని చూశాను" అన్నాడు గాని వినాయకరావుకి గుర్తు రాలేదు.

రూం మేట్లు గనక అనతి కాలంలో మిత్రులై పోయారు వాళ్ళిద్దరూ. ఒకరి కష్టసుఖాలొకరడిగి తెలుసుకున్నారు.

దొందుకు దొందే.

చిన్నప్పటినుండీ వారాలు చేసి చదువుకున్న వారే.

ఇప్పుడు కృష్ణారావుకి ఏదో స్కాలర్ షిప్ దొరుకుతోంది. కనుక నెలనెలా ఖర్చులు పోను చేతికి డబ్బు కూడా అందుతోంది.

వినాయకరావు అక్క విధిలేక టైపిస్టుగా చేసి ఏదో చాలీ చాలని మొత్తం పంపిస్తావుంది వినాయకరావుకి.

ఏదో పిచ్చాపాటి మాట్లాడుతున్నప్పుడల్లా, "మనమేదో పరిస్థితులుబాగుండి ఇలాగున్నామొరేయ్! లేకుంటే మనమూ సంఘంలో 'దొంగలు'గా మారి వుందుమేమో! ప్రతి మనిషిలో ఒక దొంగ వుంటాడు-సుమా!" అనే వాడు కృష్ణారావు.

"ఏమోనబ్బా! వెనకటికి వారాలు చేసుకు గడిపిన రోజులు మంచి రోజులా? అప్పుడు మాత్రం మనం దొంగతనం చేశామా? నువ్వుగాని ఎప్పుడన్నా చేశావా ఏం?" అనేవాడు వినాయకరావు.

"దొరికితే కొరత వేస్తారనే భయంతో ఎవ్వరూ దొంగతనం చెయ్యరు గాని, దొరకను అనే ధైర్యం కలిగించే అవకాశమొస్తే అందరూ దొంగలే" అనేవాడు కృష్ణారావు.

"అదేం మాట, నేనొప్పుకోను" అనేవాడు వినాయకరావు.

ఒకరోజు వినాయకరావుకి, అక్కకేదో సుస్తీచేసి కలవు పెట్టినట్టూ, చేసేది టెంపరరీ ఉద్యోగం గనక, జీతమేమీ రాదంటూ అందుచేత ఈ నెలకేమీ పంపలేదన్నట్టూ - నీ తంటాలేవో నీవు పడు మా తిప్పలు మేం పడతాం ఈ ఒక్కనెలా - అని వాళ్ళమ్మ రాసింది.

"పాపం! నా పర్సులో నాలుగొందలు ఉన్నాయని నమ్మి అతని వద్ద ఉన్నదంతా యిచ్చేశాడు. అతని కెలాంటి యిబ్బంది ఉన్నాయో-ఏమో? ఎంతలా మోసగించానని బాధపడ్డాను. ఈ నాటికీ బాధ పడుతున్నాను."

అక్కంటే వల్లమాలిన అభిమానం వినాయకరావుకి.

"నాతంటాలమాట దేవుడెరుగు, ముందు అక్కనిచూసి రావాల"న్నాడు కృష్ణారావుతో.

ఆ రోజే కృష్ణారావుకి చేతికందింది ఓ పంద. అందుండి ఓ



పాతికైనా సర్దడా- అని ఆశించాడు వినాయకరావు.

"సీతంటాలు సీవుపడమన్నారు గనక, స్నేహితుణ్ణి గనక ఆ హోటలుకి సగమైనా కడతాను. ఎలాగో ఈ నెల గడిచాక వచ్చేనెల మాట తర్వాత చూసుకుందాం. ఇప్పుడు నీవు పాతికో పరకో ఖర్చుపెట్టుకొని మీ వూరెళ్ళిరావా లంటే అనవసరపు ఖర్చుగదా? సుస్తీలంటే వస్తుంటాయ్, పోతుంటాయ్. అయినా సీరియస్‌గా వుందని రాయలేదు కదా మీ అమ్మ." అన్నాడు కృష్ణారావు.

"ఆ హోటలు కివ్వ దల్చుకున్న దేదో ఇటు పారెయ్యరా, బాబ్బాబు!



ముందు అక్కని చూసిరావా" అన్నాడు వినాయకరావు.

"వద్దురా, వారేయ్! నా మాట విను. భారం పెంచుకోకు. నీకు అక్కమీదున్న అభిమానం హర్షించదగ్గదే గాని, రేపొద్దున ఆమె బిడ్డనే పెంచిన వాడివౌతావు. ఏదో నేను సర్దుదామనుకున్న కాడికి నిన్ను మళ్ళీ అడగనులే. ఆలోచించు?" అన్నడు కృష్ణారావు.

"ఇబ్బందన్నానని బెగ్ చేస్తున్నాననుకున్నావా? అప్పుగానే ఇయ్యి." అన్నాడు వినాయకరావు కోపం తెచ్చుకొని.

"ఇవ్వనంటే దొంగతనం గాని చేస్తావా? బెగ్, బారో ఆర్ స్టీల్

అన్నారనీ" అన్నాడు నవ్వుతూ కృష్ణారావు.

"నువ్వు కాదంటే ఆ పనే చేస్తాను" అన్నాడు వినాయకరావు.

"అదేం మాట, నేనొప్పుకోననే వాడివే. అవసరాన్ని బట్టి మనిషి దొంగ అవుతాడంటే కాదనేవాడివే. ఆ పని మాత్రం చెయ్యకు. జీవితాంతం పరితపించాల్సొస్తుందొరేయ్." అన్నాడు కృష్ణారావు.

"ఇంతకీ నువ్విస్తావా లేదా?"

"ఇవ్వను."

"ఇవ్వనంటే ఎటోపోయి దొంగతనమైనా చేస్తాను."

"ఒరే రావూ! ఒకప్పుడు ఇలాటి పరిస్థితిలోనే నేనేం చేశానో తెలుసా? చెప్తుంటే సిగ్గని నీకిన్నాళ్ళూ చెప్పలేదు. ఎన్నిసార్లో నోటి చివరిదాకా వచ్చినా, దాచేశాను. అమ్మకు సుస్తీ చేసిందని జాబొచ్చింది. బొటా బొటిగా బస్సు చార్జీలున్నాయి పర్సులో. పర్సు మాత్రం ఉబ్బెత్తుగా వుంది ఉత్తి కాయితాలతో. టికెట్టు కొనుక్కొని ఆఖరి సీటుకి ముందుసీటులో కూర్చున్నాను. టప్ మని ఏదో చప్పుడైంది గాని, ఆందోళనలో వున్నానేమో పట్టించుకోలేదు. ఆ వెనుక ఒక్కడంటే ఒక్కడొచ్చి ఆఖరి సీట్లో కూర్చుంటూ కూర్చో బోయే ముందు వంగి ఏదో తీశాడు. ఇంకాసేపయ్యాక ఇంటి వద్దనుండి వచ్చిన ఉత్తరం మళ్ళా ఒకసారి చదువుదామని పేంటుజేబులో చేయ పెడితే పర్సు లేదు. అయితే ఇందాక టప్ మన్నది నా పర్సా-అనుకునే సరికి, అయితే ఆ వెనకాతలతను వంగి తీసింది నా పర్సే కాదు గదా- అని స్ట్రైకయ్యింది. అప్పటికప్పుడే నాలో ఓ దురాలోచన కలిగింది. ఇంటికెళ్ళ గానే అమ్మ మందులకని డబ్బుకావాలి. 'నా పర్సుబాబోయ్!'అని గావుకేక పెట్టాను. ఏవిటేవిటని బస్సులో వాళ్ళంతా అడుగుతుంటే వెనకాతలతను ఖంగారు దాచుకుంటున్నాడు. కాని సంగతి తెలిసిన నాకు మాత్రం అది కనబడి పోతోంది. 'వెనకగాని పడిందేమో చూడండి ముందు'-అన్నారు కొందరు. వెనకున్నతను కిందంతా వెతికి, 'అబ్బే లేదండీ' అన్నాడు. 'బయట గాని ఎవడన్నా కొట్టేశాడేమో!' అన్నాడు వెనకాతలతను.

"అబ్బేలేదండీ,బస్సెక్కినప్పుడు

జేబులో వున్నట్టు బాగా గుర్తు" అన్నాను. "అంతగుర్తుంటే మా జేబులన్నీ వెతకండి. ఏ పుట్టలో ఏ పాముందో, అదే బయటికొస్తుంది. ఎంతుందేవిటి ఆ పర్సులో?" అన్నాడొకాయన. వెనకాతలున్నతనికి చిరుచెమటలు పట్టడంగమనించాను. "ఎంతో నా? నాలుగొందలే అనుకొండి. అయినా వీరు అన్నట్టు బయటే ఎవడో కొట్టేసుండ గూడదా?" అని వెనకాతల తన్ని చూపెడుతూ అని, "నేనెక్కడో పారేసుకుని వెధవది నాలుగొందల కోసం పదిమందిని అనవసరంగా అవమానం చేయడం ధర్మంకాదు. పోతే పోయిందిలెండి వెధవ పర్సు" అన్నాను. "అంతేలెండి అదీ మంచి మాటే" అన్నారు ఎవరో. 'ఏవండీ జేబులుగాని వెతుకుతారా?' అన్నట్లు దీనంగా చూశాడు వెనకాతలాయన. పరిస్థితిగ్రహించి, "ఇప్పుడొచ్చిన పెద్ద బాధేమీలేదు గాని, విజయవాడలో దిగి పక్కనున్న పల్లె కెళ్ళాలి. అక్కడ మా అమ్మకు సుస్తీగావుంది. పోతూ పోతూ మందులు కొనుక్కెళ్ళాలి. అదొక్కటే బాధ. ఏంజేస్తాంలెండి ఇంటికెళ్ళి మళ్ళీ రావాలి తప్పదు. ఆలస్యమౌతుందే, అవతలామెకి సీరియస్‌గా వుందేఅని బాధ" అని ముఖంలో రంగులు మార్చి మార్చి లెక్చరిచ్చాను. అంతలో ఒకాయన "ఎంతకావాలండీ ఓ పది చాలా?" అన్నాడు. "ఎందుకండీ మీకు శ్రమ? అయినా పదేమూలకి లెండి. పాతికైనాకావాలి' అన్నాను. "ఇదుగోండి నావంతు పది" అనిఆయన పదినోటు ఇవ్వబోయాడు. "ఒద్దండి ఒద్దండి" అంటుండగానే మరి కొందరు 'ఉంచండిఉంచండి ఫర్వాలేదంటూ' తలాకొంత ఇచ్చారు బలవంతాన్న. వెనకాతలున్నాయన పది హేను ఇస్తూ—

"ఇంతే వుందండీ. లేకుంటే అంతా నేనే ఇద్దును" అన్నాడు.

"పాతిక చాలంటే ఎందుకండీ ఇదంతా?" అన్నాను.

"అదేం మాట లెండి. సమయానికి ఇంకేం అవసర మొస్తుందో" అన్నారు. అంతా కలిపి వంద జమయ్యింది. నా అవసరం గడిచిందనుకున్నాను. ఇంటికెళ్ళాక అమ్మ బాగానేవుంది. అప్పుడు గుర్తొచ్చాడు వెనకాతలాయన. పాపం నా పర్సులో నాలుగొందలున్నాయని నమ్మి, అతనివద్ద వున్నదంతా ఇచ్చేశాడు. అతని కెలాటి ఇబ్బందు లున్నాయో- ఏమో? ఎందు

కిలా మోసగించాననిబాధపడ్డాను. ఈ నాటికీ బాధపడుతుంటాను. ఇప్పుడా వ్యక్తి కనిపిస్తే అతని పదిహేను రూపాయలు అతనికి అందచేసి, నా బాధ తగ్గించుకుందామనుకుంటున్నాను. ఏదో సందర్భమొచ్చింది గనక చెప్పానొరేయ్" అని ఇంకా ఏదో చెప్ప బోతుంటే వినాయకరావు పక పకా నవ్వాడు.

"ఏం? ఎందుకలా నవ్వుతున్నావ్?" అన్నాడు కృష్ణారావు.

"నీ దొంగ ముఖం చూసి" అన్నాడు వినాయకరావు.

"అందుకనే సిగ్గుపడి ఈ విషయం ఎవరితోనూ చెప్పుకోలేదు" అని సిగ్గుపడ్డాడు కృష్ణారావు.

"అసలు సంగతి వినవోయ్. నీ వెనకాతల కూర్చున్న వాడు నా మిత్రుడు నాగరాజు, మావూరే. తల్లి చచ్చిపోయిందని తెలియగా నేదిక్కు తోచక బస్సెక్కాడు. అంత్యక్రియలెలా చేయాలో కూడా తోచబడి గాని ట్రైమ్‌లో నీ పర్సు ఖర్మగాలి వాడికి దొరికింది. ఉన్న పదిహేనూ నీవు నేర్పుగా గుంజుకున్నావు. వాడు సంతోషంతో యింటి కెళ్ళాడు. పదిహేను రూపాయలు పోతే పోయాయి - నాలుగొందల రూపాయల పర్సు దక్కింది కదా అని, ఎంతో ఆనందిస్తూ ఈల వేసుకుంటూ పర్సు తీసి నీ పర్సంతా వెతికి బావురుమన్నాడు. అందులో నీ ఫోటో వుంది. సంగతంతా నాతో చెప్పుకొని ఏడ్చుకొన్నాడు. నీ దొంగ ముఖం అంతగా చూశాను గనకనే ఎప్పట్నుంచో నిన్నెక్కడో చూశానొరేయ్ అని ఏడ్చాను." అని ఇంకా ఏదో అనబోతుంటే-

"ఆ నాగరాజు ఇప్పుడెక్కడ?" అన్నాడు కృష్ణారావు.

"మా వూళ్ళోనే" అన్నాడు వినాయకరావు.

"అయితే, వొరేయ్! నీవడిగిన పాతికిస్తాను గాని, పైన పదిహేను కూడా ఇస్తాను. ఆ నాగరాజుకిచ్చి నా తరఫున క్షమాపణ చెప్పు" అన్నాడు కృష్ణారావు.

మొత్తం నలభై అందుకున్న వినాయకరావు అవసరం గడుపుకున్నాడేగాని, నాగరాజుకి ఆ పదిహేను ఇవ్వలేదు.

ఎవరుదొంగలో, ఎవరుదొరలో అర్థం గాదు!

*